## ఘనంగా మృగశిర కార్తె



బోధన్ మండలం అమ్దాపూర్ శివారులోని చెరువు వద్దకు చేపలు కొనేందుకు వచ్చిన ప్రజలు

మోర్తాడ్/భీమ్‌గల్/రెంజల్/బోధన్ రూరల్, జూన్8: జిల్లాలో మృగశిర కార్తె (మిరుగు) పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీ కావడంతో ఉదయం నుంచే అన్ని గ్రామాల్లో చేపల కోసం జనం ఎగబడ్డారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, రెంజల్ మండల కేంద్రాల్లో చేపల మార్కెట్ వద్ద సందడి నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేపల కొనుగోలు కోసం మార్కెట్ల వద్ద ప్రజల సందడి కనిపించింది. బోధన్ మండలం అమ్దాపూర్ శివారులోని చెరువు చేపల కొనుగోలు దారులతో కిటకిటలాడింది. కిలో రూ.120 కిలో చొప్పున విక్రయించారు.

## శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



బోర్గాం చౌరస్తాలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహం

సుభాష్‌నగర్, జూన్8: నగరశివారులోని బోర్గాం చౌరస్తాలో చత్రపతి శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త హాజరై మాట్లాడారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకొని హిందూ సామ్రాజ్య దినోత్సవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తున్నదని శివాజీ మహారాజ్ సేవాసమితి ప్రతినిధులు అన్నారు. లక్ష్మణ్‌రావు, ఆర్ఎస్ఎస్ నగర ప్రతినిధి సత్యం, సమితి అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## వివాహిత అదృశ్యం

సిరికొండ, జూన్8: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన మున్నూరు శోభ అలియస్ సంధ్య అదృశ్యమైనట్లు ఎస్సై రామ్ ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. శనివారం ఉదయం 5 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త మున్నూరు మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

# పనిచేయని నిఘా నేత్రాలు

- సీసీ కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం
- తలెత్తుతున్న శాంతి భద్రతల సమస్యలు

పోతంగల్, జూన్ 8: ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. నేరాలు జరిగిన కొద్ది వ్యవధిలోనే సీసీ కెమెరాల సహాయంతో ఎన్నో కేసులు ఛేదించిన సంఘటనలు ఉన్నాయి. పోతంగల్ మండల కేంద్రంలో 2022 సంవత్సరంలో ప్రజలు, వ్యాపారుల సహకారంతో ప్రధాన కూడళ్ల వద్ద సుమారు 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని స్థానిక గ్రామ పంచాయతీకి అనుసంధానం చేశారు. మండల కేంద్రంలో ఎక్కడ చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగినా.. పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల సహాయంతో వాటిని ఛేధించారు. రెండేండ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం వాటిల్లో కొన్ని పనిచేయడం లేదు. కొన్ని ప్రదేశాల్లో కేబుల్ కట్ అవడం, సెటప్‌లు కాలిపోవడం, వర్షపు నీరు చేరడంతో పనిచేయకుండా పోయాయి. మండల కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో గడిచిన రెండు నెలల్లో రెండు ప్రదేశాల్లో బైక్‌లు ఎత్తుకెళ్లారు. ఆ సమయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులను గుర్తించే వీలు లేకుండా పోయింది. ఇప్పటికైనా సీసీ కెమెరాల నిర్వహణపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పనిచేయని సీసీ కెమెరాలు

### శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకం



శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకం. పోతంగల్ మండల కేంద్రంతోపాటు కోటగిరిలో కొన్ని సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పనిచేయని సీసీ కెమెరాలను త్వరలో రిపేర్ చేయించి, కొత్తగా మరి కొన్ని ప్రదేశాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది. గ్రామస్తులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– సునీల్, ఎస్సై, కోటగిరి

## కళ తప్పిన ఖండ్‌గామ్ పల్లె ప్రకృతి వనం



చెట్లు లేని పల్లె ప్రకృతివనం

బోధన్ రూరల్, జూన్ 8: మొన్నటి వరకు పచ్చని చెట్లు..తీరొక్క పూలతో ఆహ్లాదం పంచిన పల్లె ప్రకృతి వనాలు ఇప్పుడు కళ తప్పి అధ్వానంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ హరితహారంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వివిధ పూలు, పండ్ల మొక్కలను పెంచడమే కాకుండా పిల్లలు, పెద్దలకు సాయంత్రం ఉల్లాసంగా గడిపేందుకు ఈ వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన తర్వాత అధికారులు నిర్వహణను గాలి కొదిలేయడంతో మొక్కలు, చెట్లు ఎండిపోయాయి. బోధన్ మండలంలోని ఖండ్‌గామ్ గ్రామంలో పల్లె ప్రకృతి వనం చెట్లు లేక మైదానాన్ని తలపిస్తున్నది. జీపీ పాలక వర్గాలు పూర్తి కావడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలల్లో మొక్కలు పెంచి ఆహ్లాదాన్ని పంచాలని తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 'ఆకాశవాణి' రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

ఖలీల్‌వాడి, జూన్ 8: అడవి రాజబాబు వ్యాఖ్యాతగా రంగస్థలం నటుడిగా, రేడియో ప్రయోక్తగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా విలువైన సేవలు అందించాడని హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ఆకాశవాణి వ్యాఖ్యాత అడవి రాజబాబు ఉద్యోగ విరమణ సభలో ఆయన మాట్లాడారు. 1991 నుంచి 95 వరకు నిజామాబాద్ ఆకాశవాణి ఎఫ్ఎం కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ వంటి యువతకు, ఔత్సాహిక రచయితలకు, కళాకారులకు అవకాశం కల్పించడంలో ముందున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాజబాబును సత్కరించారు. కార్యక్రమంలో గోపాల్, బట్టు దయానంద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అడవి రాజబాబు దంపతులను సన్మానిస్తున్న ఘనపురం దేవేందర్

## అర్ధరాత్రి మందు బాబుల హంగామా

వినాయక్‌నగర్, జూన్8: జిల్లాలో ఎక్కడా అవాంచనీయ ఘటనలు జరగకుండా అదుపు చేసేందుకు కట్టిదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై పోకిరీలు, మందు బాబుల ఆగడాలను అరికట్టేందుకు ఆయన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అందు కోసం రాత్రి 10.30 గంటల వరకు వ్యాపార సంస్థలు, పాన్‌షాపులు, టీ స్టాళ్లు, హోటళ్లను మూసి వేయిస్తున్నారు. రాత్రి నిర్దేశిత సమయం దాటిన తర్వాత వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. వారికి కోర్టులు జైలు శిక్షలు సైతం విధిస్తున్నాయి. ఈ చర్యలతో చాలా వరకు రాత్రివేళ్లలో జరిగే నేరాలు కూడా అదుపుకోకి వచ్చాయి. శనివారం రాత్రి నగర శివారులోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో సారంగాపూర్ వద్ద ఓ హోటల్ షటర్ వేసి నడుపుతున్నట్లు పోలీసులకు తెలిసింది. దీంతో నైట్ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు సిబ్బంది ఆ హోటల్ వద్దకు వెళ్లారు. హోటల్ లోపల ఉన్న వారందనినీ బయటికి పంపించారు. వారిలో మద్యం తాగి ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులపై తిరగబడమే కాకుండా నెట్టివేశారు. ఆ దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియలో పోస్ట్ చేశారు. ఈ విషయమై సంబంధిత ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావ్‌ను వివరణ కోరగా కానిస్టేబుల్‌ను ఎవరూ నెట్టివేయలేదని అన్నారు. మద్యం తాగి ఉన్న వారిని కానిస్టేబుల్ పోలీస్ జీపులో కూర్చోబెడుతుండగా తీసిన వీడియో అని అన్నారు. అక్కడ జరిగిన ఘటనలో ముగ్గురిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మహాసభను విజయవంతం చేయండి

కోటగిరి, జూన్ 8: మండల కేంద్రంలో ఈనెల 10న మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ మండల మహాజన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని రోజుల నుంచి గ్రామాల్లో సీపీఐ గ్రామశాఖ సమావేశాలు నిర్వహించామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. మండల మహాజన సభకు ఆయా గ్రామాల శాఖ కార్యదర్శులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. సీపీఐ నాయకులు నల్ల గంగాధర్, తోట సాయిలు, గోపి, ఎండీ అన్వర్ పాల్గొన్నారు.

## శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్8: చత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని పిల్లలను పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని విద్యాభారతి దక్షిణ క్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం పూలాంగ్‌చౌరస్తా కొత్త టీటీడీ కల్యాణమండపంలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్‌రావు సుదీర్ఘ ప్రసంగం చేశారు. శివాజీకి వ్యతిరేకంగా కొందరు ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలు నమ్మవద్దని, వాస్తవ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. మరాఠావీరుడు శివాజీ వారసులుగా భారతీయులు మారాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఠాగూర్, సందీప్‌సింగ్‌పాల్గొన్నారు

## నేడు జిల్లాలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటన

కంఠేశ్వర్, జూన్8: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఇందల్వాయి మండల కేంద్రంలోని సీతారామస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ కార్యకర్త శ్రీకుమార్ వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. అనంతరం రెండు గంటలకు జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ కుంచాల రాజును పరామర్శిస్తారు.

**విజయవంతం చేయాలి**

ఇందల్వాయి, జూన్ 8: మండల కేంద్రంలోని శ్రీసీతారామ స్వామి ఆలయాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సందర్శిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలువేరి దాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## మాజీ ఎంపీపీ తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

జక్రాన్‌పల్లి, జూన్8: మాజీ ఎంపీపీ కుంచాల రాజు మాతృమూర్తి కుంచాల రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం సికింద్రాపూర్ గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. కుంచాల రాజును పరామర్శించి మనోధైర్యం చెప్పారు. బాజిరెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకుడు సాంబారి మోహన్, డిచ్‌పల్లి మాజీ ఎంపీపీ లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, జక్రాన్‌పల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, మాజీ ఎంపీపీ ఢీకొండ శ్రీనివాస్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ధర్పల్లిలో వైద్య శిబిరం



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు మౌనిక

ధర్పల్లి, జూన్ 8:మండల కేంద్రంలోని సత్యసాయి సేవా సదన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. సాయిసదన్‌లో ఉదయం నుంచి మహిళల ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వ వైద్యురాలు మౌనిక అవగాహన కల్పించారు. అనంతరం అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందిని సేవా సదన్ సభ్యులు సన్మానించారు. ఈ శిబిరంలో 80 మంది మహిళలు, 10 మంది పురుషులకు వైద్య చికిత్సలు అందించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి మండల కన్వీనర్ ఎం.శ్రీనివాస్, ప్రతినిధులు శంకర్, జిల్లా యూత్ కోఆర్డినేటర్ వినీత, బాలవికాస్ జిల్లా కోఆర్డినేటర్ మంచుగంటి శోభ, సభ్యులు కృష్ణవేణి, మమత, నవనీత, రాజమణి పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



గోన్‌గొప్పులలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

భీమ్‌గల్, జూన్, 8 : మండలంలోని గోన్‌గొప్పులలో ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భోజా గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సేపూర్ చరణ్ గౌడ్, నాయకులు వంజరి శంకర్, సుదర్శన్ గౌడ్, బొర్రన్న, మాన్సింగ్, రమేశ్, ప్రవీణ్‌గౌడ్, నర్సయ్య, బోడ శంకర్, ఈసుబ్, రాంచందర్, బోడ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముచ్కూర్‌లో కలిసిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



నందిపేట్‌లో పాల్గొన్న 2000–2001బ్యాచ్ పూర్వ విద్యార్థులు

భీమ్‌గల్, జూన్, 8 : మండలంలోని ముచ్కూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎస్సెస్సీ 1998–99 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. అలనాటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

**నందిపేట్‌లో..**

ఆర్మూర్‌టౌన్, జూన్ 8: నందిపేట్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నవోదయ 2000–2001 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# ప్రమాదకరంగా ప్రధాన రోడ్లు



రెంజల్ శివారులో గుంతలు పడిన ప్రధాన రోడ్డు



కందకుర్తి – ధర్మాబాద్ వెళ్లే రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన కర్ర

రెంజల్, జూన్ 8 : వర్షాకాలం ప్రారంభానికి ముందే రెంజల్–కందకుర్తి, కళ్యాపూర్– దూపల్లిగేట్, సాటాపూర్ తెలంగాణ చౌరస్తా, ప్రధాన రోడ్లు గుంతల మయంగా మారాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రభుత్వ నిర్లక్ష్యం వాహనదారుల పాలిట శాపంగా మారాయి. దీంతో ఎక్కడో ఓ చోట నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈరోడ్డు మార్గాల్లో అడుగడుగునా ఏర్పడిన గుంతలను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏడాది కాలంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చక పోవడంతో గుంతలో పడిన వాహనాలు తరుచుగా ప్రమాదాల బారిన పడడం పరిపాటిగా మారింది. నిజామాబాద్, బోధన్, ధర్మాబాద్ పట్టణాలకు రాకపోకలు సాగించే వాహనదారులు అరచేతిలో ప్రాణం పెట్టుకొని గమ్యాన్ని చేరుకుంటున్నామని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రాత్రి సమయాల్లో అడుగడునా ఏర్పడిన గుంతల మయమైన ఈ మార్గం గుండా రాక పోకలు సాగించేందుకు వాహనదారులు, జనం జంకుతున్నారు. రెంజల్ , సాటాపూర్ తెలంగాణ చౌరస్తా, సాటాపూర్–తాడ్‌బిలోలి వరకు ఇటీవల కురిసిన వర్షం నీరు నిలిచి గుంతను గుర్తించని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కందకుర్తి సమీపంలో ఏర్పడిన గుంతలను గుర్తించిన ప్రజలు కర్రలను ఏర్పాటు చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించి ఏర్పడిన గుంతల మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### ప్రతిపాదనలు పంపించాం..

రెంజల్– కందకుర్తి, కళ్యాపూర్– దూపల్లి గేట్ వరకు ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధుల కొరత కారణంగా ఆలస్యమైంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే టెండర్లు పిలిచి మరమ్మతు పనులను వెంటనే చేపడుతాం.

–రామ్మోహన్‌రావు, ఆర్‌అండ్‌బీ డీఈ, బోధన్

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కోటగిరి, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు కోటగిరి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శానం సాయిలు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కోటగిరి మాలివాడ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగరాజులు తదితరులు పాల్గొన్నారు.

**గాంధీనగర్‌లో..**

మోర్తాడ్, జూన్ 8 : కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని గాంధీనగర్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బడిఈడు పిల్లలను గుర్తించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే పిల్లలకు కలిగే ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి మాలివాడలో అవగాహన కల్పిస్తున్న హెడ్‌మాస్టర్ శానం సాయిలు



కమ్మర్‌పల్లి గాంధీనగర్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

## ఆర్మూర్‌లో దొంగతనం

ఆర్మూర్‌టౌన్, జూన్ 8 : ఆర్మూర్ పట్టణంలోని పంత్‌రోడ్డులో సాయి చైతన్య సూపర్ మార్కెట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. ఇనుప రాడ్డుతో షెట్టర్ తాళాలను పగులగొట్టి షాపులోకి చొరబడి కొన్ని వస్తువులు, 80వేల రూపాయల నగదును దొంగిలించినట్లు షాపు యజమాని తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

## 'ప్రజలపై పెట్టిన కేసులను రద్దు చేయాలి'

సిరికొండ, జూన్8: జోగుళాంబ గద్వాల జిల్లాలోని పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో పాల్గొన్న ప్రజలపై పెట్టిన కేసులను వెంటనే రద్దు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. గడ్కోల్ గ్రామంలో పార్టీ కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని స్థానికులు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ అనుమతులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే నీరు, నేల, గాలి కలుషితమై ప్రజలు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు రామకృష్ణ, నాయకులు రమేశ్, దామోదర్, సాయారెడ్డి, బాబన్న, లింబన్న, కిశోర్, రమేశ్, రాములు, నరేశ్, అనీశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌పై నుంచి పడి మాజీ సర్పంచ్ మృతి



పిట్ల మీనా(ఫైల్)

మోర్తాడ్, జూన్ 8 : తిమ్మాపూర్ శివారులో ఆదివారం ఉదయం బైక్‌పై నుంచి కిందపడి ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ పిట్ల మీనా(48) మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మోర్తాడ్‌కు వచ్చిన మీనాను ఏర్గట్లలో దింపేందుకు తమ్ముడు బోగ నిత్యానంద్ తీసుకెళ్తుండగా తిమ్మాపూర్ శివారులో అకస్మాతుగా కుక్క అడ్డువచ్చి బైక్‌ను ఢీ కొన్నది. బైక్‌పై నుంచి కింద పడిన మీనా తల వెనకభాగంలో తీవ్రగాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందింది. మీనా భర్త పిట్ల నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుళికల మందు తాగిన తండ్రీకొడుకులు

- తండ్రి మృతి.. కొడుకు పరిస్థితి విషమం

మాక్లూర్, జూన్ 8 : తండ్రీ కొడుకులు ఇద్దరూ జీవితంపై విరక్తి చెంది గుళికల మందు తాగగా తండ్రి మరణించగా కొడుకు పరిస్థితి విషమంగా మారిన ఘటన మండలంలోని మానిక్‌భండార్ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మానిక్‌భండార్‌కు చెందిన ఆకుల సాయిలు (74) అతడి చిన్నకుమారుడు సతీశ్ (39) ఇద్దరు ఈ నెల 6న ఇంట్లో గుళికల మందు తాగగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా సాయిలు మృతి చెందాడు. సతీశ్‌కు గతంలో మూడుసార్లు వివాహమై విడాకులయ్యాయి. ప్రస్తుతం తండ్రి, చిన్నకొడుకు కలిసి ఉంటున్నారు. సతీశ్‌కు పక్షవాతం రాగా అతడి తండ్రి బాగోగులు చూసుకునేవాడు. కుమారుడికి సేవ చేయడం భారమై దవాఖానలో చికిత్స చేయించడానికి ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు సేవించగా తండ్రి మృతి చెందాడు. సతీశ్ పరిస్థితి విషమంగా ఉన్నది. పెద్ద కుమారుడు ఆకుల సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రెండు బైకులు ఢీ : ముగ్గురికి గాయాలు



యంచ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

నవీపేట, జూన్ 8: మండలంలోని యంచ గోదావరి బ్రిడ్జి సమీపంలో ఆదివారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఫకీరాబాద్ గ్రామానికి చెందిన రాథోడ్ రాజు, విజయ్ సొంత పనుల నిమిత్తం బైక్ పై బాసరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామం ఫకీరాబాద్‌కు వస్తుండగా నవీపేట వైపు నుంచి ధర్మాబాద్ వైపు బైక్ పై వెళ్తున్న వ్యక్తి బైక్ ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో హుటాహుటిన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.